
సాక్షి
కాకినాడ
శనివారం | 24 | జూన్ | 2023



డెల్టాలకు 5,730 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కులు విడుదల చేశారు.



సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం

రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారు త్వరలో వజ్రకిరీటాలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0°/25.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	32.0	25.5
కాకినాడ	30.0	26.9
అమలాపురం	34.0	26.0

న్యూస్‌రీల్

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షలు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని జన్మనక్షత్ర పూజలు

రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు ఆలయం తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరులను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు సత్యదేవునికి యాగశాలలో ఆయుష్య హోమం నిర్వహించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టిం శివ, యనమండ్ర శర్మ, ఇంద్రగంటి నర్సింహమూర్తి, తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రూ.20 లక్షలతో మహా నివేదనశాల



మహా నివేదనశాలను నిర్మించనున్న దాత చక్కా సూర్యనారాయణమూర్తి దంపతులు

అన్నవరం: రత్నగిరిపై వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయ సమీపంలో మహా నివేదన శాల నూతన భవనం నిర్మాణానికి తునికి చెందిన పారిశ్రామిక వేత్త చక్కా సూర్యనారాయణ మూర్తి దంపతులు ముందుకు వచ్చారు. రూ.20 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించి దేవస్థానానికి అప్పగించేందుకు వారు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి దేవస్థానంలో వివిధ నిర్మాణాలకు తమ వంతు సహాయసహకారాలు అందజేయాలని ఆయన కోరారు.

జెడ్పీలో 12 మందికి పదోన్నతి

కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యం పరిధిలో 12 మంది ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ప్రమోషన్ ఇస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రమోషన్ పొందినవారిలో 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఒక వీడీవో గ్రేడ్-1 ఉన్నారు. ఆ ఉద్యోగులను జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి అభినందించారు. త్వరితగతిన పదోన్నతులు కల్పించడంపై ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, పదోన్నతులు పొందిన ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

1,283 మందికి బంగారుకొండ కిట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన బంగారుకొండ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడంలో తొలి అడుగులు వేశామని కలెక్టర్ మాధవీలత అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, ఆడిట్ అధికారులతో కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ దినేష‌కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో బలహీనంగా, వయసుకు తగిన బరువు, ఎత్తు లేని 1,283 మంది పిల్లలను గుర్తించి వారికి బాలమిత్రల ద్వారా బంగారు కొండ కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ మేరకు బాలమిత్రల భాగస్వామ్యం, చొరవను ప్రత్యేకంగా అభినందించారు. తొలి వారం క్షేత్ర స్థాయిలో బాలమిత్రలు దత్తత తీసుకున్న చిన్నారుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించామన్నారు. మొత్తం ఆరు నెలల పాటు బాలమిత్ర ఆయా గృహాలను సందర్శించాలన్నారు. ప్రతి నెలా జిల్లాలో బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. బంగారుకొండ కింద బాలమిత్రలుగా రూ.3 వేలు చెల్లించిన వారి పేరుతో ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ప్రతి బుధవారం బాలమిత్రలు చిన్నారుల ఇంటి సందర్శనకు వెళ్లే క్రమంలో ముందురోజు ఆ సమాచారాన్ని చిన్నారుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

తొలకరి అటెన్షన్

- ఈ ఆరు నెలలు సీజనల్ వ్యాధులకు ఆస్కారం
- నియంత్రణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు
- అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు సూచన



అగ్నిగుండంలా అట్టుడికిన జిల్లా రుతుపవనాల పుణ్యమా అని చల్లబడుతోంది. పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం మేఘావృతమవుతూ చల్లని వాతావరణం శీతల గాలుల్లా స్పృశిస్తోంది. ఈ ఆహ్లాదకరమైన చల్లదనం మాటున ఆందోళన కలిగించే వాస్తవం ఉంది. తొలకరి టెన్షన్ 'అటెన్షన్' అంటూ హెచ్చరిస్తోంది. అనేక సూక్ష్మ, అతిసూక్ష్మ క్రిముల వృద్ధి, క్రియాశీలత్వానికి ఈ వాతావరణం దోహదపడటమే కాక సీజనల్ వ్యాధులు ప్రబలేలా చేస్తుంది.

కాకినాడ క్రైం: రుతువుల మార్పులతో విజృంభించే సీజనల్ వ్యాధులు జూన్ నుంచి నవంబర్ వరకు కొనసాగుతాయి. నీటి కాలుష్యం, కీటకాలు, క్రిముల వృద్ధి, చలనం వల్ల సీజనల్ వ్యాధులు సంక్రమిస్తాయి. మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు, డయేరియా, టైఫాయిడ్‌లను సీజనల్ వ్యాధులుగా పరిగణిస్తారు. వీటి నియంత్రణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ ఏడాది కూడా ప్రత్యేక కార్యాచరణతో సిద్ధమైంది. కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇద్దరు ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు కీలక జనిత వ్యాధుల నిర్వహణాధికారి కాగా, వాటర్న్ బార్న్ విభాగానికి నిర్వహణాధికారిగా డాక్టర్ బండారు రవికుమార్ సాంక్రమిక వ్యాధులు నివారణాధికారి హోదాలో కొనసాగుతున్నారు.

వెక్టార్ బార్న్ ఇలా..

కీటక జనిత వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు తెలిపారు. అనాఫిలిస్ దోమ మాధ్యమంగా మలేరియా ప్లాస్మోడియం ప్రోటోజోవా ద్వారా సంక్రమిస్తుందన్నారు. డెంగీ, చికెన్ గున్య ఈడిస్ దోమ మాధ్యమంగా డెంగీ కీటకం ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు. పలుమార్లు ప్రాణాపాయంగా మారే అవకాశం ఉన్న రోగాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతూ నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు.

చర్యలు ఇవీ..

పల్లపు ప్రాంతాలను పూడ్చడం, మురికి కాల్వల్లో పూడిక తీత, చెరువులతో సహా జలవనరులన్నింటినీ పరిశుభ్రంగా నిర్వహించడం, తాత్కాలిక, శాశ్వత వాటర్ బాడీలైన ట్యాంకులు, నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఇళ్లల్లో దోమ తెరల ఏర్పాటు, డ్రోన్‌ల ద్వారా స్ప్రే పిచికారీ, ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేల ద్వారా ఇళ్లల్లో స్ప్రే చల్లడం ద్వారా కీటక జనిత సీజనల్ వ్యాధుల నివారణ చేపడుతున్నామని మలేరియా నివారణ అధికారి భాస్కరరావు తెలిపారు. వాటర్ బోర్న్ వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నట్లు సాంక్రమిక వ్యాధులు నివారణాధికారి డాక్టర్ బండారు రవికుమార్ తెలిపారు.

నివారణ చర్యలు

సాలమనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతరంగా పరిణమిస్తాయని డాక్టర్ రవికుమార్ తెలిపారు. బ్యాక్టీరియా కారకం ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. నీటి జనిత సాంక్రమిక వ్యాధుల నివారణ కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మలేరియా నివారణ కోసం చేపడుతున్న ఫ్రై డే డ్రై డే బహుళ ప్రయోజనాలను ఇస్తుందన్నారు. మంచి నీటి నిల్వల్లో పెరిగే బ్యాక్టీరియా నివారణకు క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఫ్రిజ్ వెనుక పాత్రలో నీరు, కొబ్బరి చిప్పలు, టైర్లలో నీరు, పూల కుండీలు, నీటి కుంటల్లో లార్వా వృద్ధి చెంది సాల్మెనెల్లా టైఫీని విస్తరిస్తాయన్నారు. వీటి నివారణకు క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు.

ప్రజలకు సూచనలు

- నీటి కుంటలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.
- కొబ్బరి బొండాలు, చిప్పల వ్యర్థాలు, పాడు బడ్డ టైర్లు ఇంటికి సమీపంలో ఉంచకూడదు.
- వర్షాకాలంలో పరిశుభ్రత పాటించాలి.
- దోమలు ప్రవేశానికి ఇంటిలో ఆస్కారం ఇవ్వకుండా ఈగలు వాలని వేడి ఆహారాన్ని మాత్రమే తినాలి.
- దోమ తెరలు విరివిగా ఉపయోగించాలి.

డెంగీతోనే ఆందోళన



ఏటా జూన్ నుంచి డెంగీ కేసుల సం**ఖ్య పెరుగుతూ వస్తోంది.** గతేడాది **కేసులు నమోదైతే ఈ** ఏడాది **జనవరి నుంచి ఇప్పటివర**కూ 54 **నమోదయ్యాయి. ప్రజలు** అప్ర**మత్తంగా ఉండాలి. లక్షణా**లు కనిపిస్తే తక్షణమే సమీ**పంలో ఉన్న ప్రభుత్వ ఫ్యామిలీ** డాక్టర్‌ను సంప్రదించా**లి. ప్రతి ఆరోగ్య కేంద్రం**లోనూ మందులు, పరీక్షల **కోసం కిట్లు సిద్ధం చేసి** ఉంచాం. ఈ నెలంతా **మలేరియా నివారణ మా**సోత్సవం నిర్వహిస్తున్నాం. **జూలై నెల అంతా డెంగీ ని**వారణ మాసోత్సవ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ రోణంకి రమేష్,
ఇంచార్జి డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా



పెద్దాపురం అర్బన్‌లో దోమల నివారణకు ఫాగింగ్



కట్టమూరులో లార్వా నివారణ మందు పిచికారీ

26న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఫెడరల్ బ్యాంక్ కంపెనీలో ఏజెన్సీ లీడర్ మేనేజర్, ఏజెన్సీ లీడర్, ముత్తూట్ ఫైనాన్స్‌లో ఇంటర్న్‌షిప్, సీనియర్ రిలేషన్ షిప్ ఆఫీసర్, ప్రొబిషనరీ ఆఫీసర్, కస్టమర్‌కేర్ ఎగ్జిక్యూటివ్ అండ్ అసిస్టెంట్ మేనేజర్, జగదీశ్వరి ఐటీ ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌లో అసిస్టెంట్ టెక్నికల్ ఇంజినీర్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, ఇసుజు మోటార్స్, డిక్సాన్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ అండ్ ఎంకాం ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్ లోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

బెండపూడిలో తెనాలి వాసి మృతి



మృతుడు రవి

తొండంగి: బెండపూడి శివారులో శుక్రవారం గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. గ్రామ శివారులో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఎస్.రవికుమార్, పోలీసు సిబ్బంది వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తెనాలికి చెందిన గర్నిపూడి రవి (60)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొద్ది రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తెలిపారని ఎస్సై వివరించారు. మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ జ్యోతితో జేసీ ఇలక్కియా



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

- మానసికోల్లాసానికి క్రీడలు దోహదం
- జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ రన్‌కు జిల్లా ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రుగోవిందరాజు అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జెండా ఊపి, ఒలింపిక్ జ్యోతిని వెలిగించి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసికోల్లాసానికి క్రీడలు దోహద పడతాయన్నారు. రన్‌ను ప్రారంభించడం చాల్లా సంతోషంగా ఉందన్నారు. క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రన్ నిర్వహిస్తున్న జిల్లా సంఘాన్ని జేసీ అభినందించారు. డీఎస్ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రోజూ ఒక గంట ఏదో ఒక క్రీడలో సాధన చేయడం ద్వారా శరీరానికి మంచి వ్యాయామం అందుతుందన్నారు. ఒలింపిక్ సంఘ కార్యదర్శి కె.స్వర్ణన్‌రాజు మాట్లాడుతూ ఏటా సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రన్ జిల్లా క్రీడామైదానం నుంచి కేన్సర్ హాస్పటల్ జంక్షన్ వరకు తిరిగి స్టేడియానికి చేరుకుంది. రన్‌లో పాల్గొన్న క్రీడాకారులకు అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రిభామిరెడ్డి,ఉపాధ్యక్షుడు బి.అర్జునరావు, సంయుక్త కార్యదర్శి ఎలీషాబాబు, కోశాధికారి కొండలరావు, వ్యాయమ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జార్జి, జిల్లా అధ్యక్షుడు రవిరాజు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, బంగార్రాజు, రంగారావు, నాగమణి, కృష్ణమూర్తి, డీఎస్ఏ కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధి పొందని అర్హుల గుర్తింపు

- జగనన్న సురక్షలో ఇంటింటికీ వెళ్లి ఆరా
- సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, ఎంపీ పిలుపు



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వంగా గీత, కలెక్టర్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: అర్హత ఉన్న వారంతా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి మరీ ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడి హాజరయ్యారు. ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అమలులో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. శనివారం నుంచి వారం, పది రోజుల పాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సహకారం, సమన్వయంతో ప్రతి ఇంటినీ సందర్శించనున్నట్లు తెలిపారు. అర్హత ఉండి ఎక్కడైనా లబ్ధి పొందని వారుంటే గుర్తిస్తారన్నారు. సమస్య పరిష్కారానికి దరఖాస్తులు నింపి, అవసరమైన పత్రాలను సేకరిస్తారన్నారు.

1 నుంచి శిబిరాలు

జూలై 1 నుంచి తహసీల్దార్, ఈవోపీఆర్డీతో కూడిన ఒక బృందం, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌తో కూడా మరో బృందం సచివాలయాల వారీగా క్యాంపులు నిర్వహించి అక్కడికక్కడే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీలు మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్ కార్డు విభజన, కుటుంబ వివరాల్లో మార్పులు వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమంలో జగనన్న సురక్ష శిబిరాల ఏర్పాటుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత, సీపీవో పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి

బాలాజీచెరువు(కాకినాడసిటీ): పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో బాలికలే పైచేయిగా నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఫలితాల్లో జిల్లా 70.93 శాతం ఉత్తీర్ణతతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. జిల్లాలో ఈ పరీక్షలకు 9,630 మంది హాజరయ్యారు. 6,831 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 3,771, బాలికలు 3,060 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌లు తెలిపారు.

పంట మార్పిడి.. మేలైన దిగుబడి

- చీడపీడల నుంచి రక్షణ
- భూసారం పెంపు
- ఎరువులు, మందుల ఖర్చు ఆదా
- సమీకృత వ్యవసాయంపై అవగాహన



పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



కాకినాడ జిల్లాలో సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సాగు చేసే పంటనే మళ్లీ మళ్లీ వేస్తే భూమిలో సారం తగ్గిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గిపోతాయంటున్నారు. పంటల మార్పిడే దీనికి పరిష్కారమని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఒకే పంటలతో చీడపీడలు

ఏటా ఒకే పంట సాగు చేస్తే భూసారం తగ్గిపోతుంది. పంటలపై చీడపీడలు విజృంభిస్తాయి. రెండు లేదా మూడేళ్లకోసారి అయినా పంట మార్పిడి చేస్తే చీడపీడలు అదుపులో ఉంటాయి. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి పెరిగి భూసారం వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా సస్యరక్షణ మందుల ఖర్చు తగ్గించవచ్చు.

రైతులకు అవగాహన

సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించేలా రైతులకు వ్యవసాయశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎకరంలో ఫిష్ కల్చర్, వరి, కోళ్లఫారం, కూరగాయాలు పండిచేలా సూచనలిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేసుకోవచ్చు. వరి పంట సుమారు 120 నుంచి 150 రోజులు వస్తుంది. అదే చిరు ధాన్యాలైతే 90 రోజుల్లో పంట పూర్తవుతుంది. ఏటా మూడు పంటలు వేసుకోవచ్చు. ఆదాయం కూడా పెరుగుతుంది. వరి సాగు చేస్తే రెండు సీజన్లలో రూ. 25 వేలు మాత్రమే మిగులుతుంది.

పంట మార్పిడితో లాభాలు

- పంట మార్పిడి వల్ల చీడపీడలను అదుపులో ఉంచవచ్చు.
- రెండు లేదా మూడు పంటలను పండిస్తే ఏదో పంట వల్ల లాభం పొందవచ్చు.
- పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- ఒకే రకమైన పైరు వేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉండడంతో దిగుబడి తగ్గి నష్టపోతున్నారు.
- పంట మార్పిడితో పురుగు మందుల ఖర్చు తగ్గించవచ్చు.
- పత్తి వేసిన పాలంలో మిరప పంట సాగు చేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప వేసిన పాలంలో పత్తి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయి.
- మిరప సాగుకు ముందు భూమిలో జనుమ, పిల్లి పెసర వంటి పంటలను సాగు చేస్తే భూసారం పెరుగుతుంది. చీడపీడలు దరిచేరవు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము లాంటి పంటలు ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి తర్వాత పప్పుధాన్యాలు గానీ నూనె గింజలు గాని సాగు చేస్తే తెగుళ్ల ఆశించవు.
- తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చు.
- కంది సాగుతో నేలలో పైరు ఆకుల రాలి కుళ్లిపోవడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతికస్థితి మెరుగుపడి భూసారం వృద్ధి చెందుతుంది.
- వేరుశనగ, కంది, పప్పుశనగ తదితర పంటల సాగుతో వాటి వేర్ల బుడిపెలోని రైజోబియం బ్యాక్టీరియా, గాలిలోని నత్రజని నేలను సారవంతం చేస్తుంది.

రైతులకు అవగాహన



రైతులు సమీకృత వ్యవసాయం చేయాలని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వరికి బదులు ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే ఐదారు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పంట మార్పిడి వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నాం.

– ఎస్.విజయ్‌కుమార్,
జిల్లా వ్యవసాయశాఖాధికారి

సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం

- దాత వినతికి అన్నవరం దేవస్థానం అంగీకారం
- వివాహాలు, ఉపనయనాల బ్రాహ్మణుల సరఫరాకు టెండర్ కం వేలం
- రూ.7 కోట్లతో నమూనా ఆలయం, పెద్ద నిర్మాణ టెండర్లకు ఆమోదం
- శివసదన్‌లో రూ.3 కోట్లతో నిర్మాణాలు
- ధర్మకర్తల మండలి తీర్మానం



ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఈఓ, సభ్యులు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు త్వరలో వజ్రకిరీటాలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. రూ.కోటి పైగా వ్యయంతో అమ్మవారికి వజ్రకిరీటం చేయించేందుకు పెద్దాపురం శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ ఎండీ మట్టే సత్యప్రసాద్ చేసిన అభ్యర్థనకు అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈఓ చంద్రశేఖర్ అజాద్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్య తీర్మానాలివీ..

- దాత మట్టే సత్యప్రసాద్ గత ఏడాది సత్యదేవునికి వజ్రకిరీటం సమర్పించారు. అదేవిధంగా అమ్మవారికి కూడా ఆరు నెలల్లోగా వజ్రకిరీటం చేయించేందుకు అనుమతించాల్సిందిగా లేఖ రాశారు. స్వామి, అమ్మవార్లకు ఏకకాలంలో వజ్రకిరీటాలు అలంకరించాలని కోరారు. ఆ కిరీటాలకు భద్రత కల్పించాలని కోరారు. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ నిబంధనల మేరకు అమ్మవారి వజ్రకిరీటానికి అనుమతి ఇచ్చేందుకు ధర్మకర్తల మండలి సమావేశం తీర్మానం.
- దేవస్థానంలో వివాహాలు, ఉపనయనాలు తదితర శుభకార్యాలకు నిర్ణీత రుసుములకు బ్రాహ్మణులను సరఫరాకు సింగిల్ విండో విధానం అమలుపై టెండర్ కం వేలం నిర్వహణ.
- తలనీలాలు పోగు చేసుకుని, తీసుకు వెళ్లేందుకు గత నెల 24న ఈ–ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిన నిర్వహించిన టెండర్‌లో హెచ్చు పాట రూ.1.35 కోట్లకు ఆమోదం.
- జాతీయ రహదారిపై సత్యదేవ డిగ్రీ కళాశాల వద్ద సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ కోర్టు తదితర నిర్మాణాలకు రూ.3.44 కోట్ల అంచనాతో ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ (రెండోసారి) పిలిచారు. దీనిపై రివర్స్ టెండర్, సంప్రదింపుల ద్వారా 3.95 శాతం హెచ్చుతో రూ.3.57 కోట్లకు డీవీ సుబ్బరాజు కొటేషన్ దాఖలు చేశారు. అదే తక్కువ కావడంతో పచ్చజెండా.
- దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో భక్తులు సేద తీరేందుకు, వంటలు చేసుకునేందుకు, దేవస్థానంలో తూర్పు రాజగోపురానికి ఇరువైపులా గార్డెన్స్‌లో రూ.1.90 కోట్లతో తొమ్మిది షెడ్ల నిర్మాణానికి టెండర్ల ఆమోదం.
- సత్యగిరిపై రూ.15 కోట్లతో 138 గదులతో నిర్మిస్తున్న శివసదన్ సత్రం ముగింపు దశకు చేరింది. ఇందులో ఫ్లోరింగ్, ప్యానల్స్, గదులు, కిటికీలకు కర్టెన్ల వంటి వాటి ఏర్పాటు టెండర్లకు అనుమతి.
- శివసదన్ సత్రానికి రూ.87.75 లక్షలతో జనరేటర్ కొనుగోలుకు టెండర్ ఆమోదం.
- రూ.1.04 కోట్లతో లో టెన్షన్ ప్యానెల్స్ ఏర్పాటు టెండర్‌కు అనుమతి.
- రూ.39.75 లక్షలతో శివసదన్ సత్రం ఆవరణలో కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయడానికి, రూ.19.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.9.90 లక్షలతో కర్టెన్ల కొనుగోలు టెండర్లకు ఆమోదం.
- దేవస్థానంలో వివిధ అవసరాల నిమిత్తం మహీంద్ర కంపెనీ ఆథరైజ్డ్ డీలర్ నుంచి రెండు బొలేరో వాహనాల కొనుగోలుకు, విజయవాడకు చెందిన సంస్థ నుంచి రెండు ట్రాలీల కొనుగోలుకు అంగీకారం.
- దేవస్థానం బస్సు టికెట్ల రేట్లు స్వల్పంగా పెంచేందుకు ఆమోదం. రత్నగిరి నుంచి అన్నవరం రైల్వేస్టేషన్‌కు ప్రస్తుతం ఉన్న టికెట్ చార్జీ రూ.15 నుంచి రూ.20కి పెంపు. అలాగే కొండ దిగువ నుంచి రైల్వే స్టేషన్‌కు చార్జీని రూ.10 నుంచి రూ.15కు, కొండ మీద నుంచి దిగువకు రూ.5 నుంచి రూ.10కి పెంపు. తిరుగు ప్రయాణంలోనూ ఇవే రేట్ల వర్తింపు.

ఇది నా అదృష్టం



అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి వజ్రకిరీటం చేయించే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. వివిధ కారణాలతో కొంత ఆలస్యమైనా ధర్మకర్తల మండలి సభ్యులు ఈ అవకాశం కల్పించడం చాలా సంతోషమనిపించింది. ఈ కిరీటం నాలుగు నెలల్లోనే చేయించి విజయదశమి నాటికి అమ్మవారికి అలంకరించేలా ప్రయత్నం చేస్తాను.

– దాత మట్టే సత్యప్రసాద్

మహిళ ఆత్మహత్యాయత్నం

కాకినాడ రూరల్: పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ మహిళ తన ఆత్మహత్య యత్నానికి గల కారణాలను రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టింది. ఇది శుక్రవారం వైరల్ అయ్యింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. తునికి చెందిన జ్యోతి, ఆమె భర్త గుడారిగుంటలో మకాం ఉంటున్నారు. స్థానికంగా ఉన్న విష్ణు ఫిల్లింగ్ స్టేషన్‌లో ఆమె క్యాషియర్‌గా పని చేసేది. మూడు నెలల క్రితం బంక్‌లో సుమారు రూ.9 లక్షల వరకూ తేడా వచ్చింది. దీనిపై జ్యోతిని యజమాని నిలదీశారు. ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుంది. ఆ సొమ్ములు చెల్లించాలంటూ యజమాని తరఫు సిబ్బంది ఈ నెల 20న జ్యోతి ఇంటికి వెళ్లారు. అదే రోజున ఆమె చీమల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. బంక్ యజమాని వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని తండ్రి ఉండ్రాజవరపు చంటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బంక్ యజమాని విష్ణుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మురళీకృష్ణ తెలిపారు.

ఇసుక లారీ ఢీకొని మహిళ దుర్మరణం

పెద్దాపురం: ఇసుక లారీ బలంగా ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం పాలైంది. మండలంలోని దివిలి గ్రామానికి చెందిన గంటా సూర్యాకాంతం (54) భర్త లక్ష్మీపతి సమీపంలోని సుబ్బారాయుడుపేటలో ఉన్న ఓ కోళ్లఫారం వద్ద పని చేస్తున్నాడు. అతడికి సూర్యాకాంతం శుక్రవారం మధ్యాహ్నం భోజనం తీసుకువెళ్లి, తిరిగి వస్తోంది. స్థానిక రజకపేట సమీపానికి వచ్చేసరికి అప్పుడే ఇసుకను డంప్ చేసి తిరి వేగంగా వెళ్తున్న లారీ ఆమెను వెనుక నుంచి బలంగా ఢీకొంది. సుమారు 100 మీటర్ల మేర ఆమెను లాక్కుని పోయింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమవడంతో సూర్యాకాంతం అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై వెలుగుల సురేష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఆ లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు సూర్యాకాంతానికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన అక్కచెల్లెళ్లు.. కుటుంబ సభ్యుల చెంతకు..

తుని: ఇంటి నుంచి పారిపోయిన అక్కచెల్లెళ్లను పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరుకు చెందిన అక్క (16), చెల్లెలు (14) ఇంటి నుంచి పారిపోయి వచ్చి, అన్నవరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్యామ్‌త్రినాథరావు పట్టుకుని తుని జీఆర్‌పీ ఎస్సై మారూఫ్‌కు అప్పగించారు. తమ తల్లి కొన్నాళ్లుగా కువైట్‌లో ఉంటోందని, తండ్రి సయ్యద్ కలీషా పట్టించుకోవడం లేదని, అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నామని వారు పోలీసులకు చెప్పారు. అమ్మమ్మ పెట్టే బాధలు తాళలేక ఇంటి నుంచి పారిపోయి వచ్చామని తెలిపారు. దీంతో పోలీసులు వారి తండ్రి, అమ్మమ్మను తుని జీఆర్‌పీ స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి అక్కచెల్లెళ్లను వారికి అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సామర్లకోట: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి (30) మృతదేహం లభ్యమైంది. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం.. సామర్లకోట – పిఠాపురం రైల్వే లైనులో సామర్లకోట స్టేషన్ నుంచి విశాఖపట్నం శుక్రవారం వెళ్తున్న 12841 రైలుకు అడ్డంగా ఒక వ్యక్తి వచ్చాడు. ఆ రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. దీనిపై లోకోపైలట్ ఎస్‌కేజీ హుస్సేన్ స్టేషన్ మాస్టర్ దీపక్ రాజ్‌కు ఫిర్యాదు చేశాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైపోయింది. మృతుడు తెలుపు రంగు షార్ట్, ఎరుపు, నలుపు చారల రౌండ్ నెక్ టీ షర్టు ధరించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం వివరాలకు రైల్వే పోలీసు స్టేషన్‌ను 93988 50428 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

సుస్థిర అభివృద్ధిని అర్థం చేసుకోవాలి



సదస్సులో పాల్గొన్న అతిథులు, ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: పరిశోధనలతో సుస్థిర అభివృద్ధిని అర్థం చేసుకోవాలని టీసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు ఎంజీపీఎల్ నారాయణ, హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.శివకుమార్ యువతకు సూచించారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఆదిత్య కళాశాల ఐఈఈఈ విశాఖ బే సెక్షన్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్, గ్లోబల్ ఇంజినీరింగ్ చాలెంజ్(ఏజీఈసీ)పై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నారాయణ, శివకుమార్ మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధి ఔషధం వంటిదని నానో, రోబో, టెక్నో మొబైల్ అప్లికేషన్, వివిధ రకాల సాంకేతికతలను సాధించాలని అన్నారు. విద్యుత్ కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, సాంకేతికత మెరుగుపడుతూండటంతో పరిశోధనల తీరు రోజురోజుకూ మారుతోందని, యువత ఆ దిశగా అడుగులు వేయాలని చెప్పారు. ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, డీన్లు ఎస్.రమాశ్రీ, కేవీఎస్ఆర్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నేడు ఎంటీఎస్ టీచర్లకు బదిలీ కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలో పని చేస్తున్న 2008 డీఎస్సీ, 1998 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సమగ్ర శిక్షా సమావేశ హాలులో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బదిలీ కౌన్సెలింగ్‌కు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎంటీఎస్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆమె తెలిపారు.